

వేటగాళ్ల ఉచ్చులో పెద్దపులి

- తప్పించుకునే క్రమంలో తీవ్రగాయం
- కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించిన అటవీ అధికారులు
- నల్లమల అడవుల్లో రెస్క్యూ ఆపరేషన్
- బైర్లూటిలో వన్యప్రాణికి చికిత్సలు

దుర్భేధ్యమైన నల్లమల అడవుల్లో పెద్దపులిని రక్షించేందుకు అటవీ అధికారులు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైంది. ఇటీవల వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన పెద్దపులి దాన్ని తప్పించుకునేందుకు తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆ పులి పరిస్థితిని ట్రాప్స్ కెమెరాల ద్వారా గుర్తించిన అటవీశాఖ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేయాలని భావించారు. గాయపడ్డ పెద్దపులి కోసం అటవీ అధికారులు నల్లమల అడవిని జల్లెడపట్టారు. పది రోజులపాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన ప్రత్యేక బృందం ఎట్టకేలకు పెద్దపులి జాడను కనిపెట్టింది. అతి కష్టంమీద ఆ పులిని బంధించి చికిత్సలు చేయిస్తున్నారు. మరో వారం రోజుల పాటు బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రంలో సపర్యలు చేయనున్నారు.

ఆత్మకూరు, మార్చి 5:


బైర్లూటిలో చికిత్స పొందుతున్న పులి



పెద్దపులి ఆచూకీ కోసం రెస్క్యూ టీం గాలింపు

ముసలిమడుగు బీట్‌లో ఉచ్చు...

ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని ముసలిమడుగు బీట్ పరిధిలో సందుబాటు రస్తా వద్ద ఫిబ్రవరి 25వ తేదీన మూడేళ్ల వయస్సు గల ఓ ఆడపులికి కొందరు వేటగాళ్లు ఉచ్చు వేసినట్లు ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి తెలిపారు. ఆ సమయంలో పులి నడుము భాగంలో బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు కలిగి ఉండి తీవ్రంగా గాయపడినట్లు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. ఈ విషయాన్ని స్థానిక అటవీ అధికారులు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎస్ మూర్తి, ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ అలాన్ చోంగ్ టెరాన్ దృష్టికి తీసుకెళ్లారు. వారు నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లగా రెస్క్యూ ఆపరేషన్ ద్వారా గాయపడిన పులిని బంధించి చికిత్సలు చేయించాలని సూచించారు.

వన్యవేటగాళ్లపై చర్యలుంటాయా?

పెద్దపులి పరిస్థితిని ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎస్.మూర్తి స్వయంగా వచ్చి పర్యవేక్షించారు. గాయపడిన పులిని గుర్తించి సంరక్షించడం అరుదైన విషయమని తెలిపారు. వన్యప్రాణుల కోసం ఉచ్చులు వేసే వ్యక్తులపై నిఘా ఉంచామని, పట్టుబడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇదిలావుంటే బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చుతో వెలుగోడు రేంజ్‌లో కూడా ఓ పెద్దపులి మెడపై తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈఘటన మరువక ముందే క్లచ్ వైర్ ఉచ్చుకు మరో పులి చిక్కడం ఆందోళన కలిగిస్తోంది. నిష్ణాతులైన వేటగాళ్లే ఈ ఉచ్చులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అటవీశాఖ ఎలాంటి తీసుకుంటుందో వేచిచూడాల్సిందే మరీ.

రెస్క్యూ ఆపరేషన్‌లో 55 మంది

ప్రమాదంలో పడ్డ పెద్ద పులిని గుర్తించిన అధికారులు టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీని ఆశ్రయించారు. వెంటనే మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఐదుగురితో కూడిన రెస్క్యూ బృందంతో పాటు 50 మంది అటవీశాఖ ఉద్యోగులు, ప్రొటెక్షన్ వాచర్లు బృందంగా ఏర్పడి పులిని పట్టుకునే ప్రయత్నం చేశారు. గాయపడిన పులి ముసలిమడుగు, శివపురం, గుమ్మడాపురం, కొత్తపల్లి గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించి ఆయా అటవీ ప్రాంతాల్లో 60 కెమెరా ట్రాప్స్‌తో పాటు రెండు డ్రోన్ కెమెరాల ద్వారా పదిరోజుల పాటు రేయింబవళ్లు అన్వేషణ మొదలుపెట్టారు.


ముసలిమడుగు గ్రామ సమీపంలో పెద్దపులి ఆచూకీ కోసం మహారాష్ట్ర బృందాల చర్యలు

హమ్మయ్యా... చిక్కిన పులి

దాదాపు పది రోజుల పాటు శక్తివంచన లేకుండా రెస్క్యూటీం కృషికి మంగళవారం ఫలితం వచ్చింది. ఎట్టకేలకు కొత్తపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి ఉన్నట్లు ప్రత్యేక బృందం గుర్తించింది. వెంటనే ఎన్‌క్లోసర్ గన్ ద్వారా మత్తుమందు ఇచ్చారు. మత్తులోకి జారుకున్న పెద్దపులిని బోనులో ఎక్కించి వన్యప్రాణి సంరక్షణ వాహనంలో బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రానికి తరలించారు. అక్కడ వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్లచే చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం పులి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వారం రోజుల పాటు సపర్యలు చేసి గాయం నయమైన వెంటనే తిరిగి అటవీ ప్రాంతంలో వదిలి వేయనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.


పెద్దపులిని బంధించి బోనులో తరలిస్తున్న అటవీ అధికారులు


గాజులదిన్నె జలాశయం

దాహార్తి..!

వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. 39-40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరాయి. ఇప్పటికే జిల్లాలో కొన్ని చోట్ల తాగు నీటి సమస్య వచ్చింది. ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోతున్నాయి. జిల్లా దాహార్తిగా మారిపోతున్నది. వేసవి తీవ్రత దృష్ట్యా ఉన్న నీటిని పొదుపుగా వాడుకోకపోతే తాగునీటి ముప్పు తప్పదని ఇంజనీర్లు హెచ్చరిస్తున్నారు. ఏ ఏ జలాశయంలో ఎంత నీరు నిల్వ ఉంది..? పరిసర గ్రామాల్లో తాగునీటి అవసరాలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను పరిశీలిస్తే రాబోయే రోజుల్లో వేసవి నీటి ఎద్దడి తీవ్రం అయ్యే ప్రమాదం కనిపిస్తున్నది. ఈ ప్రమాద ఘంటికలను గుర్తించి నీటి వినియోగంలో ముందస్తు పొదుపు చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని ఇంజనీర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం శనివారం కలెక్టరు డాక్టర్ జి. సృజన గ్రామీణ తాగునీటి విభాగం, జలవనరుల శాఖ, పురపాలక శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో తాగునీటి కోసం వివిధ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు (టీఎంసీల్లో)

జలాశయం	సామర్థ్యం/ వాటా	అందుబాటులో ఉన్నది
తుంగభద్ర	17.32	1.74
సుంకేసుల	1.20	0.177
గాజులదిన్నె	4.50	1.553
పులికనుమ	1.126	0.25
కృష్ణగిరి	0.164	0.164
పత్తికొండ	1.126	0.41
మొత్తం	25,436	4.294

- జిల్లాలో ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు!
- జలాశయాల్లో తగ్గిపోతున్న నీటి నిల్వలు
- అందుబాటులో ఉన్నది 4.294 టీఎంసీలే
- నీటి పొదుపు పాటించకపోతే ఇబ్బందులు తప్పవంటున్న ఇంజనీర్లు
- కలెక్టరుకు నివేదిక


నగరూరు గ్రామంలో పైపుల లీకేజీ నీటిని ఒడిసి పడుతున్న మహిళ

ఎస్ఎస్ ట్యాంకులు నింపుకోవాలి

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ద్వారా 195 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి 2023-24 నీటి సంవత్సరంలో ఎల్లెల్సీ వాటా 12.226 టీఎంసీలు, కేసీ వాటా 5.094 టీఎంసీలు కలిపి 17.32 టీఎంసీలు కేటాయించారు. కేసీ వాటాలో ఒక టీఎంసీ ఎల్లెల్సీకి, ఒక టీఎంసీ హెచ్చెల్సీకి మళ్లించారు. సోమవారం నాటికి కేవలం ఎల్లెల్సీ కోటా 0.55 టీఎంసీలు, కేసీ కోటా 1.19 టీఎంసీలు కలిపి 1.74 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉంది. తుంగభద్ర డ్యాంలో ప్రస్తుతం 8.25 టీఎంసీలు మాత్రమే ఉంది. 4 టీఎంసీలకు పడిపోతే మన వాటా మిగులు జలాలు ఉన్నా.. టీడీపీ అధికారులు విడుదల చేసేందుకు అవకాశం ఉండదు. దీంతో మిగులు నీటిని ఎల్లెల్సీ ద్వారా తీసుకొని గాజులదిన్నె జలాశయం సహా ఎస్ఎస్ ట్యాంకులు, వివిధ చెరువుల్లో నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. శ్రీశైలం జలాశయంలో 37.35 టీఎంసీలు నిల్వ ఉన్నా కర్నూలు జిల్లాకు పెద్దగా ఉపయోగం ఉండదు. ప్రస్తుతం ఎల్లెల్సీలో ఆదోని మండలం హానవాలు వద్ద 451 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. 210 క్యూసెక్కులు గాజులదిన్నెకు విడుదల చేస్తున్నారు. అదే క్రమంలో ఎస్ఎస్ ట్యాంకులు నింపుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టరు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

కర్నూలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 721 హ్యాబిటేషన్ గ్రామాలు ఉన్నాయి. 2011 గణాంకాల ప్రకారం గ్రామీణ జనాభా 16.55 లక్షలు ఉన్నారు. తాజాగా 17.50 లక్షలు దాటి ఉంటుందని అంచనా. పల్లెసీమల్లో శుద్ధి చేసిన తాగునీరు అందించాలనే లక్ష్యంగా జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షణలో 32 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) ఉన్నాయి. వీటి నిర్వహణ కోసం ఏటేటా రూ.42-45 కోట్లు ఖర్చు చేస్తున్నారు. 225 గ్రామాలకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. మరో 496 గ్రామాల్లో పీడబ్ల్యూసీ పథకాలు, చేతిబోర్లు ద్వారా తాగునీరు అందిస్తున్నారు. సోమవారం జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 39.1 డిగ్రీలకు చేరింది. ఉదయం 11.30 గంటలు దాటితే ఎండ తీవ్రతకు జనం తల్లడిల్లుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రత 42-45 డిగ్రీలకు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. పల్లె ముంగిట నీటి ఎద్దడి తలెత్తకుండా వేసవి దాహం తీర్చే దిశగా జిల్లా యంత్రాంగం తొలి ప్రాధాన్యతగా పనులు చేయాలి.. నీటి పొదుపుపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అందుబాటులో 4.294 టీఎంసీలే:

జిల్లాలో తుంగభద్ర డ్యాం, గాజులదిన్నె, కృష్ణగిరి, పత్తికొండ, పులికనుమ, సుంకేసుల జలాశయాలు ద్వారా ఆయా గ్రామాలు సహా కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ.. వంటి పట్టణాలకు తాగునీరు అందుతుంది. ఆయా జలాశయాల్లో శనివారం నాటికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు 4.294 టీఎంసీలే. అందులో వేసవి ఎండల తీవ్రతకు నెలకు 1.5 (రిజర్వాయర్ లాసెస్) నీటి ఆవిరి ఉంటుందని ఇంజనీర్లు అంటున్నారు. మూడు నెలలకు సగటున 2.5 శాతం చొప్పున 0.107 టీఎంసీలు నష్టపోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా లీకేజీలు, నీటి పంపిణీలో నష్టం, నీటి దొంగతనం.. రూపంలో సగటున 20-25 శాతం నీటి నష్టం పోవాల్సి ఉంటుంది. తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీ ద్వారా మన వాటా నీటిని తీసుకుంటే 135 కి.మీలు కర్ణాటకలో ప్రవహించాల్సి ఉంటుంది. అక్కడ నీటి చౌర్యం, సిస్టమ్ లాస్ దాదాపు 30-35 శాతం ఉంటుందని అంటున్నారు. వీటన్నిటిని పరిగణలోకి తీసుకుంటే సరాసరి 3.25 టీఎంసీలకు మించి అందుబాటులో ఉండదని అంచనా వేస్తు న్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జలవనరుల శాఖ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజనీర్లు, సిబ్బంది సమన్వయంతో ప్రతి నీటి బొట్టును పక్కాగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేయాలి. నిర్లక్ష్యం చేస్తే నీటి ఎద్దడితో అల్లాడాల్సి వస్తుంది.

రావణ వాహనంపై మల్లన్న విహారం

- కాణిపాకం వరసిద్ది వినాయక ఆలయం నుంచి పట్టువస్త్రాలు
- నేడు పుష్పపల్లకి



శ్రీశైలం, మార్చి 5: శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబైన రావణవాహనంపై ఆశీనులను చేసి ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ రాజగోపురం నుంచి వెలుపలకు తీసుకొచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాధికాలను నిర్వహించి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం జరిపారు.

పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలంలో వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం తరపున ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఎ.మోహనరెడ్డి, ఈవో ఎ.వెంకటేశ్ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

నేడు పుష్పపల్లకిసేవ : బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు పుష్పపల్లకిసేవ నిర్వహించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఆహూతులను అలరించాయి. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీకళా వేదిక, శివదీక్షా శిబిరాల ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు కొనసాగాయి.




శ్రీశైల వైభవం నాటక ప్రదర్శన

వైసీపీకి షాక్

- మంత్రి జయరాం ఆ పార్టీకి రాజీనామా
- చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

కర్నూలు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీకి గట్టిషాక్ తగిలింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం వైసీపీ సభ్యత్వానికి, మంత్రి పదవికి మంగళవారం రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన జయహో బీసీ సదస్సులో మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో మంత్రి జయరాం టీడీపీలో చేరారు. ఆయనతో పాటు సోదరులు గుమ్మనూరు నారాయణ, నారాయణస్వామి, గుమ్మగనూరు శ్రీనివాసులు సహా ఆలూరు నియోజకవర్గంలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ మండల కన్వీనర్లు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ అధినేత చంద్రబాబు టీడీపీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ 12 ఏళ్లు వైసీపీ జెండా మోశానని, ఆలూరు ప్రజలకు దూరం కావడం ఇష్టం లేదన్నారు. అందుకే కర్నూలు ఎంపీ టికెట్ ఇచ్చినా వెళ్లలేదన్నారు. సీఎం జగన్ శిలావిగ్రహమైతే ఆ శిల్పానికి సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి ఇద్దరు పూజారులు అని జయరాం ఎద్దేవా చేశారు. ఆ ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.


జయరాంకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు



జోష్ పెంచిన జయహో బీసీ

- బలహీనవర్గాలకు చేరువయ్యేలా బీసీ డిక్లరేషన్
- ఆ సామాజికవర్గాల్లో ఆనందోత్సహాలు



బీసీ డిక్లరేషన్ సభావేదికపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్

కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ.. సామాజిక.. విద్యా.. ఆర్థిక రంగాల్లో వెనుకబడిన బీసీల కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సంయుక్తంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. మంగళవారం మంగళగిరి వేదికగా విడుదల చేసి డిక్లరేషన్ బీసీ కులాలలో మరింత ఉత్సాహం పెంచింది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సీఎం జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ 34 శతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో రాష్ట్రంలో 16,800 మంది పదువులు కోల్పోయారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘన విజయం సాధించి 34 శాతం పునరుద్ధరణతో కోల్పోయిన పదువులు బీసీలకే ఆ పదవులు దక్కనున్నాయి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురైన బీసీలు 1982లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని వేదికగా మార్చుకొని ఎందరో రాజకీయంగా ఎదిగారు. పసుపు జెండాకు వెన్నుదన్నుగా నిలిచారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ-జనసేన వెల్లడించి బీసీ డిక్లరేషన్‌పై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

చారిత్రాత్మక నిర్ణయం



చట్ట సభల్లో బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని ఏడు దశాబ్దాలుగా పోరాడుతున్నాం. ఏ రాజకీయ పార్టీ కూడా దీనిని పట్టించుకోలేదు. టీడీపీ 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తే సైకో జగన్ 24 శాతానికి తగ్గించాడు. చంద్రబాబు, పవన్‌లు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మక నిర్ణయం.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు


శుభ పరిణామం



ఏపీలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తామని, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ అందజేస్తామని ప్రకటించడం శుభపరిణామం. పది అంశాలతో కూడిన బీసీ డిక్లరేషన్ పత్రాన్ని విడుదల చేయడం హర్షణీయం.

-బత్తిన లోకనాథ్, పత్తికొండ మండలం

టీడీపీతోనే బీసీ సాధికారిత



టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలో ఉన్న 153 ఉప కులాలకు మేలు జరిగేలా ఉంది. వడ్డెర, రజక, చేనేత, వాల్మీకి, కురుబ, యాదవ, నాయిబ్రాహ్మణ కులాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రకటించడం హర్షణీయం.

-దేవేంద్రప్ప, ఆలూరు.

పెళ్లి కానుక రూ.లక్ష



ముప్పాతిక శాతం బీసీలు ఆర్థికంగా వెనుకబడిన వారే. ఆడపిల్లల వివాహాలు చేసేందుకు అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారు. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ఇచ్చాక ఇచ్చే పెళ్లి కానుక రూ.లక్ష బీసీ తల్లిదండ్రులకు గొప్ప వరం. బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతంగా తీసుకెళ్లేలా ఈ డిక్లరేషన్ ఉంది.

-రేఖాగౌడ్, జనసేన పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి

బీసీల నడ్డివిరిచిన వైసీపీ

వైసీపీ ప్రభుత్వం చేనేత వస్త్రాలకు జీఎస్టీ విధించి చేనేతల నడ్డివిరిచింది. బీసీల డిక్లరేషన్‌లో చేనేతవస్త్రాలపై జీఎస్టీ రద్దుచేస్తామని ప్రకటించటం చేనేతలకు ఊరట. చేనేతలకు ఆర్థిక అభివృద్ధికి మరింత ఉపయోగపడుతుంది.

-మల్లికార్జున, ఎమ్మిగనూరు

బీసీలకు సామాజిక రక్షణ చట్టం

బీసీల రక్షణకోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు ప్రకటించటం హర్షించదగ్గ విషయం. రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

-చావిడి వెంకటేష్, మంత్రాలయం

బీసీల ఆర్థిక ప్రగతికి పెద్దపీట



బీసీలకు రక్షణ చట్టం, సబ్ ప్లాన్ నిధులు వల్ల బీసీలకు మరింత న్యాయం జరుగుతుంది. ఆర్థిక ప్రగతికి పెద్దపీట వేశారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదువుల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించడం అభినందనీయం. టీడీపీ-జనసేన కూటమి ఎంతో దూరదృష్టితో ఆలోచించి డిక్లరేషన్ విడుదల చేశారు.

- నాగరాజు యాదవ్, టీడీపీ



జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపులు, సబ్ ప్లాన్ నిధులు రూ.1.50 లక్షల కోట్లు బీసీలకే వినియోగించేలా బీసీ డిక్లరేషన్‌లో అధినేత చంద్రబాబు ప్రకటించడం అభినందనీయం. స్వయం ఉపాధి కోసం ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు వెచ్చించేలా యువతలో ఆర్థిక చేయుత అభిస్తుంది.

-మహేశ్‌గౌడ్, టీడీపీ బీసీ సెల్, పాణ్యం

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్

చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించటం సాహసోపేతమైన నిర్ణయం. టీడీపీ బీసీలకు అండదండగా ఉంటుంది.

-ముగతి ఈరన్న గౌడ్, నందవరం

జడ్పీకి ఆర్థిక సంఘం నిధులు విడుదల

కర్నూలు(న్యూసిటీ), మార్చి 5: 2023-24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత 15 ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంటు రూ.5.12 కోట్లు, టైడ్ గ్రాంట్ రూ.7,69 కోట్లు మొత్తం రూ.12.81 కోట్లు, 53 మండల పరిషత్‌లకు బేసిక్ గ్రాంట్ రూ.5.13 కోట్లు, టైడ్ గ్రాంట్ రూ.7.69 కోట్లు మొత్తం రూ.12.82 కోట్లు జిల్లా పరిషత్, మండల పరిషత్తుకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌లో 813 మంది విద్యార్థులు గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మంగళవారం జరిగిన పరీక్షకు 813 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 20,927 మంది ఉన్నారు. ఇందులో 20,114 మంది పరీక్షకు హాజరు కాగా, 813 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవోతో పాటు డీవీఈవో జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు తనిఖీలు నిర్వహించారు.

టీసీసీ ఫలితాలు విడుదల

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాల మేరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ)కు సంబంధించి పరీక్షా ఫలితాలు ప్రకటించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలను డిసెంబరు 17న నిర్వహించినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైనవారు సంబంధిత సర్టిఫికెట్ల కోసం డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పాసింగ్ విధానం వద్దు

- ఆదోని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



వేరుశనగ వ్యాపారులతో సమావేశమైన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 5: మార్కెట్ యార్డులో వేరుశనగకు పాసింగ్ (గ్రేడింగ్) విధానాన్ని స్వస్తి పలకకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో వేరుశనగ వ్యాపారులతో సమావేశమయ్యారు. ఆంధ్రజ్యోతిలో వెలువడిన "వ్యాపారుల మాయాజాలం, పాసింగ్‌తో రైతులు దగా" అనే కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. సాయంత్రం వేరుశనగ వ్యాపారులను కార్యాలయానికి పిలిపించి సమావేశమయ్యారు. మార్కెటింగ్ శాఖ బైలాలో రైతులు తెచ్చిన దిగుబడికి కూలీలతో పాసింగ్ చేయాలని ఎక్కడా లేదన్నారు. రైతులకు నష్టం చేకూర్చే ఈ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే కూలీల చేత శుభ్రం చేయించడం, ఆలస్యంగా గన్నీ బ్యాగులను తీసుకొచ్చి సాయంత్రం తూకాలు వేసుకోవడం మంచిది కాదని తెలియజేశామన్నారు. ఇకనుంచి అయిన వ్యాపారులంతా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని తెలిపారు. వేరుశనగ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శరణప్ప మాట్లాడుతూ రైతులు రాళ్లు, మట్టి, చెత్తా, చెదారంతో వేరుశనగ తీసుకొస్తున్నారని తెలిపారు. దీనివల్ల తాము కూడా నష్టపోతున్నామని, అందుకే కూలీలతో పాసింగ్ చేయిస్తున్నామన్నారు. రైతులు శుభ్రంగా వేరుశనగను తీసుకొస్తే కొనుగోలు చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రైతులు లేదా కమిషన్ ఏజెంట్లు వాళ్లే బాధ్యత తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషన్ ఏజెంట్లను, వ్యాపారులను మరోసారి సమావేశపరిచి రైతులను చైతన్యపరిచేలా అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు.

నిందితుడి అరెస్టు

11 తులాల బంగారం, 20 వేల నగదు స్వాధీనం

నందికొట్కూరు, మార్చి 5: మిడ్తూరు మండలం తలముడిపి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి అతడి నుంచి 6,00,800 విలువైన బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నట్లు నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం నందికొట్కూరు రూరల్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన తలముడిపి గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ గౌస్ ఇంట్లోని బ్రాసెలెట్, గొలుసు, 3 ఉంగరాలతో పాటు రూ.20 వేల నగదు దొంగతనానికి గురైనట్లు మిడ్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని అన్నారు. దొంగతనం జరిగిన 3 రోజుల్లోనే నిందితుడ్ని అరెస్టు చేశామని అన్నారు. నిందితుడు నందికొట్కూరులోని అల్లూరు రోడ్డులో నివాసముంటున్న షేక్ మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించి అతడి నుంచి 11 తులాల బంగారాన్ని, రూ.20 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో మిడ్తూరు ఎస్ఐ జగన్మోహన్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు

నంద్యాల టౌన్, మార్చి 5: జిల్లాలో ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా శనగ, వేరుశనగ, పెసలు, మినుములను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు తెలిపారు. రైతుల నుంచి ఆయా పంటల దిగుబడులను ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తమ సమీప ఆర్‌బీకేలలో తమ వివరాలను నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనగలు మద్దతు ధర క్వింటం రూ.5440, మినుములు క్వింటం రూ.6950, పెసలు మద్దతు ధర క్వింటం రూ.8558, వేరుశనగ మద్దతు ధర క్వింటం రూ.6377 ప్రకారం కొంటారని తెలిపారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలలో నాఫెడ్ నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల మేరకు కొనుగోలు ఉంటుందని మేనేజర్ నాగరాజు తెలిపారు.

వైసీపీ మళ్లీ వస్తే.. ప్రజల ఆస్తులు తాకట్టు

- జగన్, బుగ్గన ఇద్దరూ మోసగాళ్లే..
- చంద్రబాబును గెలిపించుకుంటేనే భవిష్యత్తు
- కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 5: సచివాలయాన్ని తాకట్టు పెడుతున్న వైసీపీ ప్రభుత్వం మళ్లీ వస్తే.. ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం డోన్ మండలంలోని ఆవులదొడ్డి, తిమ్మాపురం, కామగానికుంట్ల, సోంపురం గ్రామాల్లో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇద్దరూ మోసగాళ్లేనని, రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన ఘనత వారికే దక్కిందని అన్నారు. సీఎం పదవిని అడ్డం పెట్టుకుని జగన్ లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. తానేమి తక్కువ కాదంటూ మంత్రి బుగ్గన వేల కోట్లు సంపాదించారని ధ్వజమెత్తారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండుసార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టినా ప్రజలకు సేవ చేసి ప్రేమాభిమానాలు సంపాదించుకున్నారని అన్నారు. మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. గత 50 ఏళ్ల నుంచి కోట్ల, కేఈ కుటుంబాలే డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాయన్నారు.

బీసీల కోసం ఎంపీ సీటు త్యాగం చేశా

కర్నూలు పార్లమెంటు బీసీలకు ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో వారి కోసం త్యాగం చేశానని కోట్ల అన్నారు. తాను కర్నూలు పార్లమెంటు స్థానం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచానని, కేంద్ర మంత్రిగా కూడా పని చేశానని అన్నారు. ఈసారి తనకు కావాలని అడిగినా వచ్చేదన్నారు. బీసీలు కూడా రాజకీయంగా ఎదగాలని ఉద్దేశంతోనే త్యాగం చేసి చంద్రబాబు కోరిక మేరకు డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలతో కోట్ల కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని అన్నారు. మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, భాస్కర్ నాయుడు, దేవరబండ వెంకటనారాయణ, చిట్యాల మద్దయ్యగౌడు, రంజిత్ కిరణ్, ఎస్ఎండీ రఫీ, వలసల బాలుడు, శ్రీరాములు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పరదేశీ మహేష్, దిలీప్ రెడ్డి, భూమా నాగన్న, మిద్దెపల్లి గోవిందు, వెంకటాపురం పెద్దయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

మంత్రాలయం/పత్తికొండ టౌన్, మార్చి 5: మంత్రాలయం, పత్తికొండ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం కలెక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు పరిశీలించారు. పత్తికొండలో జూనియర్ కళాశాలను, మంత్రాలయంలో పరిమళ విద్యానికేత్ పాఠశాలలను పరిశీలించారు. మంత్రాలయం మండలంలో సమస్యాత్మక గ్రామం మాధవరం 52వ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఈవీఎంల పంపిణీ, పార్కింగ్, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం మావరం చెక్‌పోస్టును ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మాధవరం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్లు మాధవరావు, శ్రీధర్‌రావు, ఎంపీడీవో మునెప్ప, మంత్రాలయం, కోసిగి సీఐలు ఎరిషావలి, ప్రసాద్, ఎస్ఐలు కృష్ణమూర్తి, గోపినాథ్, డీటీలు రాఘవేంద్ర, శశిశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రాలయంలో స్ట్రాంగ్‌రూమును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, అధికారులు

మిర్చి రైతు ఆవేదన

- వ్యాపారుల సిండికేట్‌తో భారీగా ధర పతనం
- క్వింటా గరిష్ఠ ధర రూ.17,191
- రూ.5వేలకు పైగా పతనం



కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన ఎండుమిర్చి బస్తాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 5: పంట సాగుకు పెట్టిన ఖర్చులు పోను కొంతైనా లాభం వస్తుందనే ఆశతో ఉన్న మిర్చి రైతులకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలోని రైతులేగాక తెలంగాణ రైతులు కూడా కర్నూలు మార్కెట్ యార్డుకు ఎండుమిర్చి విక్రయానికి తీసుకువస్తుంటారు. అయితే.. గత నెలలో రూ. 20 వేల నుంచి రూ. 30వేలకు పైగానే క్వింటం ఎండుమిర్చి అమ్ముడుపోయినప్పటికీ మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర క్వింటానికి కేవలం రూ.17,191 మాత్రమే పలికింది. నెల రోజుల వ్యవధిలో దాదాపు 5వేలకు పైగానే ధర తగ్గిపోవడం ఏమిటని రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. వ్యాపారులు వివిధ కారణాలు చూపుతూ ధరను భారీగా తగ్గిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వ్యాపారులను కట్టడి చేయడంలో అక్రమాలను నిరోధించడంలో మార్కెట్ కమిటీ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోలేకపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర కేవలం రూ.17,191 మాత్రమే రైతులకు లభించింది. మధ్యస్థ ధర రూ.10,899, కనిష్ఠ ధర మరింత ఘోరంగా రూ.800కు మాత్రమే అమ్ముడుపోయింది. వేరుశనగ కాయలకు ధర లభించడం లేదు. క్వింటానికి గరిష్ఠంగా రూ.7,069, మధ్యస్థ ధర రూ.5,970, కనిష్ఠ ధర రూ.2,222 మాత్రమే లభిస్తోంది. ఆముదాలకు క్వింటానికి గరిష్ఠంగా రూ.5,472, మధ్యస్థ ధర రూ.5,382, కనిష్ఠ ధర రూ.5,091 మాత్రమే లభించింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,161, మధ్యస్థ ధర రూ.1,939, కనిష్ఠ ధర రూ.1,719 మాత్రమే లభించింది. శనగలకు గరిష్ఠంగా రూ.6,039, మధ్యస్థ ధర రూ.5,096, కనిష్ఠ ధర రూ.3,010 మాత్రమే రైతులకు అందింది. ఉల్లిగడ్డలపై గరిష్ఠ ధర రూ.1,569, మధ్యస్థ ధర రూ.1,489, కనిష్ఠ ధర రూ.319 మాత్రమే లభించింది. కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో కొర్రలకు గరిష్ఠంగా రూ.4,069, మధ్యస్థ ధర రూ.4,049, కనిష్ఠ ధర రూ.4,029 మాత్రమే లభించింది. మినుములకు గరిష్ఠ ధర రూ.9,791, మధ్యస్థ ధర రూ.8,969, కనిష్ఠ ధర రూ.5,019 ధర లభించింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

ఎండుమిర్చి అమ్మకాల్లో వ్యాపారులు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. తూకాలు తదితర వాటిల్లో వ్యాపారులు అక్రమాలకు పాల్పడినట్లు రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి వారి లైసెన్సులు రద్దు చేస్తాం.

- గోవిందు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్ గడువు పెంపు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 5: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్‌కు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఎస్ఎల్ డయోగ్నస్టిక్ గడువును నెల రోజులు పెంచినట్లు సిటీ స్కానింగ్‌కు సంబంధించిన కేసులు రోటీన్‌గా పంపించాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. ఆసుపత్రిలో కొత్తగా చేరిన హౌస్ సర్జన్లు తప్పనిసరిగా డ్రస్ కోడ్, ఐడీ కార్డు, సమయపాలన ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆసుపత్రి క్యాజువాల్టీలో పల్మనాలజీ వైద్యులను నియమించి వారికి డ్యూటీ రోస్టర్ వేసేలా సీఎస్ఆర్ఎంవోకు ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ శివబాల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

నిందితుడిని విచారిస్తున్నాం

మహిళ హత్య బాధాకరం: సీఐ



అవుకు, మార్చి 5: అవుకు బస్టాండు సర్కిల్‌లో కుమారి అనే మహిళను నరికి చంపిన ఆమె భర్త రంగస్వామిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని బనగానపల్లె సీఐ గంటాసుబ్బారావు అన్నారు. మంగళవారం అవుకు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మహిళను విచక్షణా రహితంగా నరికి హత్య చేసిన ఘటన బాధాకరమని అన్నారు. ఈ నెల 4వ తేదిన కుమారి, ఆమె పిన్ని సుబ్బలక్ష్మమ్మ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా డ్యూటీలో ఉన్న పోలీసులు సరైన రీతిలో స్పందించక పోవడంపై విచారణ జరుపుతున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 5: నగరంలోని మౌర్యాఇన్‌లో టీడీపీ స్టేట్ జనరల్ సెక్రటరీ లక్కిటూ గోపి ఆధ్వర్యంలో 50వ వార్డుకు చెందిన ముస్లిం యువకులు, మహిళలు మంగళవారం కర్నూలు అభ్యర్థి టీజీ భరత్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ టీజీ భరత్ వెంట నడిచేందుకు సిద్ధం గా ఉన్నామన్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజల కోసం సొంతంగా ఆరు గ్యారంటీల మేనిఫెస్టోను తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ఇమ్రాన్, రఫీ, మస్తాన్, శ్రీకాంత్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపేటలో టీజీ భరత్ భరోసా యాత్ర: నగరంలోని 13వ వార్డు పరిధిలోని బంగా రుపేట, విఠల్ నగర్‌లలో మంగళవారం కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీ చేస్తానని అన్నారు. మంగళవారం ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ 6 పథకాలతోపాటు ఆయన స్వయంగా రూపొందించిన ఆరు గ్యారంటీల కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాస రెడ్డి, విఠల్ శెట్టి, సురేష్, సురేంద్ర, శివరాం, భాస్కర్, మధు, రేష్మ, నాగరాజు, బజారి, పురుషోత్తం, జనసేన నాయకులు శ్రీనివాసరెడ్డి, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి ప్రణాళికలు రూపొందించుకోండి: కలెక్టర్



పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 5: పోలింగ్ సామగ్రి త్వరితగతిన పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ జి.సృజన రిటర్నింగ్ అధికారులను సూచించారు మంగళవారం పాణ్యం, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్‌తోపాటు ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వచ్చే బస్సులను, సెక్యూరిటీ వాహనాలను, పార్కింగ్ చేయడానికి కావాల్సిన స్థలం ఉందా.. లేదా అని పరిశీలించాలన్నారు. పోలింగ్ సిబ్బంది అందరూ ముందు రోజు మధ్యాహ్నం 2 గంటల్లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. వీరివెంట జాయింట్ కలెక్టర్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి ఉన్నారు.

9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 5: స్థానిక ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో ఈనెల 9, 10 తేదీల్లో 52వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హ్యాండ్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు తెలిపారు. పోటీలు లీగ్ కం నాకౌటు పద్ధతిలో నిర్వహిస్తున్నామని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 30 నుంచి బీహార్ (సారాయి)లో జరిగే 52వ జాతీయ స్థాయి పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ఆదర్శ విద్యాసంస్థల వ్యవ స్థాపకుడు బి.తిమ్మయ్య హాజరవుతారని ఆయన తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు వార్షిక పరీక్ష ఓ వరం

కర్నూలు(అర్బన్), మార్చి 5: 2008 నుంచి 2014 వరకు వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అవకాశం కల్పించడం అభినందనీయమని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. మంగళవారం ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో విలేకరులు సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్ నిర్ణయం హర్షణీయమన్నారు. డిగ్రీలో ఫెయిల్ అయిన 15 వేల మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామరాజు, నరసప్ప, మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలకు బియ్యం సరఫరాకు జీవో జారీ

కర్నూలు(అర్బన్), మార్చి 5: సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం సివిల్ సప్లయ్ విభాగం ద్వారా కిలో రూపాయి బియ్యం సరఫరాకు జీవో జారీ అయిందని ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని కలికిరి, కంచికచెర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు సిల్వర్ జూబ్లీ కళాశాలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ జీవో జారీ చేసిందని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు విద్యార్థులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై విద్యార్థులకు పోషకాహారాన్ని అందివచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

'భూములను ధారాదత్తం చేస్తే సహించం'

కర్నూలు(హాస్పిటల్), మార్చి 5: మల్టీ యుటిలిటీ సెంటరు పేరిట కర్నూలు మెడికల్ కాలేజీ మైదానాన్ని పూర్వ విద్యార్థి సంఘానికి ధారాదత్తం చేస్తే సహించమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని నడిబొడ్డున ఉన్న స్థలంలో కేఎంసీ పూర్వ విద్యార్థి సంఘం ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో సంప్రదించకుండా ఏకపక్షంగా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి నిర్మాణానికి పూనుకోవడం దారుణమన్నారు.

రేపటి నుంచి కాల్వబుగ్గలో బ్రహ్మోత్సవాలు

ఓర్వకల్లు, మార్చి 5: కాల్వబుగ్గ రామేశ్వర స్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ అధికారులు పూర్తి చేశారు. ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించారు. ఆలయ ప్రాంగణమంతా శుభ్రపరిచి గాలిగోపురం, చిన్న కోనేరు, పెద్ద కోనేరులో వేసవిలో నీరు ఇంకిపోవడంతో బోరు ద్వారా కోనేటికి నీటిని నింపారు. ఆలయ ప్రాంగణాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, పోలీసు ఔట్‌పోస్టు, ఆరోగ్య కేంద్రం, క్యూలైన్లు, స్నానపుగదులు తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలకరించారు.

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు...

- 7న బుగ్గరామేశ్వర స్వామి కాల్వ గ్రామం నుంచి ప్రయాణం
- 8న మహాశివరాత్రి కుంకుమార్చన, ధ్వజారోహణం, పగలు బుగ్గ రామేశ్వరస్వామి, భ్రమారంభాదేవి పంచామృతాభిషేకం, స్వాములవారికి తెల్లవారుజామున 3.35 గంటలకు కళ్యాణోత్సవం.
- 9న నందివాహన సేవ, సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం
- 10న సాయంత్రం 5 గంటలకు రథోత్సవం
- 11న పగలు వసంతోత్సవం, సాయంత్రం పారువేట
- 12న బుగ్గరామేశ్వరుని, భ్రమరాంబికాదేవిలకు పంచామృతాభిషేకం
- 13న ఉత్సవమూర్తులు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణం
- బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 8న జాతీయ స్థాయి బాలుర ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమ తులు ప్రదానం చేస్తారు. వివరాలకు 7989637970 నెంబరును సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. రాత్రి 9 గంటలకు విజయ ఈవెంట్స్ క్రియేషన్స్ హైదరాబాదు వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగున్నాయి. సినీ సింగర్ రూప, నందకిషోర్, జానపద గంగిరెడ్డి, డ్యాన్సర్ మాలతి, రేలారేలా గోపాల్, సినీ డ్యాన్సర్, సింగర్ రూప, విన్నర్ సూరి, సినీ సింగర్ సోమశేఖర్, సింగర్ విజయ సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

9న భజన పోటీలు: భ్రమరాంబ బుగ్గరామేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో ఈనెల 9న భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆకుల మహేష్, అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే భజన బృందం సభ్యులు ప్రవేశ రుసుం రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. వివరాలకు 9000194078 నెంబరును సంప్రదించాలని సూచించారు.

11న బండలాగుడు పోటీలు: రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలను నిర్వహి స్తున్నట్లు రైతు సంఘం నాయకుడు నాగతిరుపాలు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 7981016808, 9640643253 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



బుగ్గ రామేశ్వరస్వామి ఆలయం

గుడారాలు ఏర్పాటు చేయండి



ఎండలు మండుతున్నాయి. పుణ్యక్షేత్రానికి వేలాది మంది భక్తులు వస్తారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు సేద తీర్చుకునేందుకు గుడారాలు ఏర్పాటు చేయాలి. అలాగే తాగునీరు కూడా అందించాలి.

- జీకే సుధాకర్, కాల్వబుగ్గ మాజీ చైర్మన్

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లన్నీ పూర్తి



శివాలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

- కల్లె లక్ష్మీనారాయణ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

అన్ని వసతులు కల్పిస్తాం



ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం. ఆలయంలో తాగు నీరు, సీసీ కెమెరాలు, ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశాం

- డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ ఈవో

మహాశక్తి మేనిఫెస్టో మహిళలకు వరం: గౌరు చరిత

ఓర్వకల్లు, మార్చి 5: టీడీపీ ప్రకటించిన మహాశక్తి మేనిఫెస్టో మహిళలకు వరం లాంటిదని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం ఓర్వకల్లులోని ఎస్సీ, బీసీ కాలనీలలో మహిళలకు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ మహిళలకు టీడీపీ అధికారంలోకి వస్తే ఎన్నో ప్రయోజనాలు ఉం టాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు మితిమీరిపోతున్నా సీఎం జగన్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, బాల్‌రెడ్డి, రామకోటేశ్వరరావు, అన్వర్‌బాషా, నాగముని, శ్రీనివాసులు, రామాంజనేయులు, అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి, అల్లాబాబు, ఏసేపు, నాగరాజు, శ్రీరాములు, నాగమల్లేష్, సంజీవ, ఆదాంబాషా పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు చరిత

కల్లూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు అరుంధతీనగర్‌లో ఆమె బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు.



ఓర్వకల్లులో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న గౌరు చరిత

- 20వ వార్డు అరుంధ తీనగర్‌లో వైసీపీ నాయకుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని కాలనీ వాసులు గౌరు చరితకు వివరించారు. సర్వే నెంబరు 154లో తమ నివాసాలను ఆక్రమించేందుకు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడి పైపులైన్లు పగలగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈవిషయాన్ని కలెక్టర్‌కు వివరించి మీకు న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.ఫిరోజ్, పల్లె.రఘునాథ్‌రెడ్డి, శేఖ ర్‌చౌదరి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగమణి, అనుసూయబాయి, మధునా యక్, జనసేన నాయకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి: డీఈవో



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో

సి.బెళగల్, మార్చి 5: పదో తరగతి విద్యార్థులు ఇష్టంతో చదవాలని డీఈవో శామ్యూల్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలను చెప్పాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రమా, ఎంఈవో ఆదాం బాషా ఉన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయాలి



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 5: ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న ఆసుపత్రులకు బకాయిపడ్డ 9 నెలలుగా నిధులు విడుదల చేయాలని సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ధర్నా చౌకులో ఆరోగ్యశ్రీ బకాయిలపై సీపీఐ నిరాహారదీక్షలు చేపట్టింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యోగ్యశ్రీ సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు 9 నెలలు బకాయిలు ఇవ్వకపోతే పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల యజమాన్యాలు పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు నిరాకరిస్తున్నారని అన్నారు. దీక్షల్లో సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు మల్లన్న, డీహెచ్‌పీఎస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కుమార్ రాజా, రామచంద్రుడు, సీపీఐ మహిళా నాయకురాలు శాంతమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

'సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలి'

సి.బెళగల్, మార్చి 5: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘాను ఉంచాలని తహసీల్దార్ అనుపమ సెక్టోరియల్ అధికారులు, ఎస్ఐ తిమ్మారెడ్డికి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె సెక్టోరియల్ అధికారులతో సమావేశమయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 5: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం తాండ్రపాడు శిక్షణా మందిరంలో సెర్ప్ సంస్థ నుంచి నామినేట్ అయిన కృషి సఖీలకు (మహిళా రైతులకు) ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, డీపీఎం చంద్రశేఖర్, నరసమ్మ, కన్సల్టెంట్ లక్ష్మయ్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ ఆంజనేయులు, సుధాకర్, రంగ స్వామి, రాముడు పాల్గొన్నారు.

11 నుంచి రోజా దర్గా ఉరుసు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 5: నగరంలోని తుంగభద్ర నది తీరాన ఉన్న రోజా దర్గా ఉరుసు ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్ దాదాపాషా ఖాద్రి తెలిపారు. మంగళవారం దర్గా ఆవరణలో ఉరుసు ఆహ్వాన పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. 11న గంధం, 12న ఉరుసు, ఖవాలి, 13 జియారత్ వేడుకలతో ఉరుసు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో సయ్యద్ షా జావీద్ పాషా ఖాద్రి, జానషిన్ ఇషాఖియా, ఇషాఖియా, సయ్యద్ నూరుల్లా ఖద్రి పాల్గొన్నారు.

హిందువుల రుద్రభూమిని పరిరక్షించండి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: జిల్లాలో హిందువుల రుద్రభూమిని కొందరు ఆక్రమించుకుంటూ ప్రార్థన మందిరాలను నిర్మిస్తున్నారని, వారి నుంచి ఆ భూములను కాపాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ కోరారు. మంగళవారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల గ్రామంలో 233/బీ, 225, 227 సర్వే నెంబర్లను కొన్ని సంస్థలు ఆక్రమించుకుని ప్రార్థన మందిరాలను నిర్మించడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్ర, అధికార ప్రతినిధి పిటి సాయిప్రదీప్, మురళి, ఉపేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

'దళితుల భూములకు రక్షణ కల్పించండి'



దళితులతో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 5: దళితుల భూములకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. మంగళవారం సీపీఎం బృందంతో కలిసి మునగాలపాడులో దళిత భూములను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు మండలం మునగాలపాడు గ్రామ పరిధిలో కేసీ కెనాల్ కింద దళితులు వందేళ్లుగా సాగుచే సుకుంటున్న భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. సర్వే నంబర్ 46సీ.50,71తోపాటు 236 నుంచి 433 వరకు ఉన్న భూములలో 60 కుటుంబాల దళితులు తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నారని అన్నారు. గతంలోనే 15 ఎకరాల దళితుల భూమిని స్వాధీనం చేసుకుని తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేశారని అన్నారు. ప్రభుత్వం అవసరమంటూ కేసీ కెనాల్‌కు 200 అడుగుల దూరంలో ఉన్న భూమిని లాక్కుంటున్న అధికారులుకు, 20 అడుగుల దూరంలో ఉన్న ప్రైవేటు వ్యక్తుల భూములు కనిపించవా అని ప్రశ్నించారు.

ఎన్నికల ప్రక్రియపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్ రావు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 5: కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావు ఎంసీఎంసీ సభ్యులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయిడ్ న్యూస్ గుర్తింపులో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ పాత్ర కీలకమన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలలో ప్రకటనల జారీకి, ఎస్ఎంఎస్ వాయిస్ మెసేజ్‌లకు ఎంసీఎంసీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఒక అభ్యర్థికి అనుకూలంగా, ఓటర్లను ప్రభావితం చేసే పెయిడ్ న్యూస్‌పైన ఎంసీఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలలో, ట్విట్టర్, యూట్యూబ్, వెబ్‌పేపర్స్ వంటి వాటిని కూడా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఎంసీ మెంబరు సెక్రటరీ సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జయమ్మ, సభ్యులు సీపీవో హిమప్రభాకర్ రాజ్, ఎన్ఐసీ డీఐవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఏఐఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, హన్స్ ఇండియా స్టాఫ్ రిపోర్టర్ వి.నరేంద్ర కుమార్, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఎలక్షన్ విభా గం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

'ఆయాల సమస్యలు పరిష్కరించాలి'



ధర్నా చేస్తున్న ఆయాలు, ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఆయాల సమస్యలు పరిష్కరించాలని, వారికి రూ.26వేలు వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు, ఆయాలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, పాఠశాలల ఆయాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకమ్మ, సిద్ధమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో పని చేస్తున్న ఆయాలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పార్కులను నాణ్యతతో నిర్మించాలి: కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 5: నగరంలో నిర్మిస్తున్న పార్కులను నాణ్యతతో నిర్మించాలని కమిషనర్ ఏ. భార్గవతేజ అన్నారు. మంగళవారం బళ్లారి చౌరస్తా వద్ద నగర పాలక సంస్థ అభివృద్ధి చేస్తున్న పరిమళ నగర్ పార్కును ఆయన సందర్శించారు. అనంతరం పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆయన వెంట డీఈ రాజశేఖర్, ఎంఏఈ ప్రవీణ్, కాంట్రాక్టర్ నవీన్ ఉన్నారు.

కోడుమూరులో వైసీపీకి భారీ షాక్

పులకుర్తి, కోడుమూరు నుంచి టీడీపీలోకి వలసలు



టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), మార్చి 5: కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ అధినేత చంద్రబాబు బొగ్గుల దస్తగిరికి అసెంబ్లీ టికెట్ కేటాయించినప్పటి నుంచి వరుసగా వైసీపీని వీడి టీడీపీలోకి వలసలు పెరి గాయి. మంగళవారం కోడుమూరు పట్టణానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే డా.సుధాకర్ వర్గానికి చెందిన వైసీపీ యువనాయకులు బోయ బలరాముడు, కౌలుట్ల, రాజోలు గిడ్డయ్య, బ్రిటీష్ రాముడు ఆధ్వర్యంలో దాదాపు 13 వాహనాల్లో బయలుదేరి 300 మంది వైసీపీ కుటుంబాలు కర్నూలులో టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతు రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరమన్నారు. టీడీపీలోకి చేరిన వారిలో సీపీఐ రాముడు, లక్ష్మీదేవి, అనిత, సుజాత, వెంటలక్ష్మీ, సువర్ణ, పెద్ద బోయగేరికి చెందిన మహిళలు ఉన్నారు.

- కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయ కుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఇమ్మానియేలు (ఎమ్మెల్యే వర్గం) తన అనుచరులతో కలిసి విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనతో పాటు డాక్టర్ గోపాల్, లక్ష్మన్న, క్రిష్ణ, చంద్రశేఖర్, వీరన్న, డా.పవన్, నాగేంద్ర, నల్లన్న, గోకారి,శ్రీను, తిమ్మప్ప, నాగప్ప, చిన్నఎల్లప్ప, రాజు, చిన్న సుంకన్న, వడ్డె,శ్రీను, గిరి, విజయ్‌తోపాటు మరో 80మంది దాక వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా వైసీపీ నాయకుడు ఇమ్మానియేలు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అనేక గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో పులకుర్తి టీడీపీ నాయకుడు త్రివేద్ పాల్గొన్నారు.
- కర్నూలు రూరల్ మండలం పసుపుల గ్రామంలో కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సూపర్ సిక్స్ పథకాలను ప్రలజకు వివరించారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంస పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరవేస్తాం

గూడూరు, మార్చి 5: కోడుమూరు కోటపై టీడీపీ జెండా ఎగరవేస్తామని పార్టీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో దస్తగిరి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. మాజీ మండల టీడీపీ కన్వీ నర్ జె సురేష్, గుడిపాడు మహేశ్వర రెడ్డి, చనుగొండ్ల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యా ప్రమాణాలు భేష్

ఐబీజీఎస్ బృందం కితాబు



విద్యార్థినులతో ఐబీజీఎస్ బృందం సభ్యులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: కర్నూలు జిల్లాలో నాణ్యమైన విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని, అంతర్జాతీయ స్థాయి జ్ఞానాన్ని అందుకోవడం సాధ్యమవుతుందని అమెరికా వాషింగ్టన్ ఇంటర్నేషనల్ ఐబీజీఎస్ బృందం ప్రతినిధి ఎరిల్‌బాలర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం ఇంగ్లాండు, అమెరికాకు చెందిన ఐబీజీఎస్ అధ్యయన బృందం కోఆర్డినేటర్ వెండి గ్రీన్ ఎరిల్ బాలర్ జిల్లాలోని డైట్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలను సభ్యులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులలో ఉన్న నైపుణ్యాలను, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. సదురు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో బృందం సభ్యులు ప్రత్యక్షంగా మాట్లాడారు. వినూత్నమైన బోధనతో విద్యార్థుల ప్రగతికి నూతన విద్యావిధానంలో కర్నూలు జిల్లాను ఎంపిక చేస్తున్నామన్నారు. ఇందులో మాతృభాష కూడా ఒక సబ్జెక్టుగా ఉంటుందని, మిగతావన్నీ ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తారని తెలిపారు. ఈ విదేశీ అధ్యయన బృందం వెంట డీఈవో శామ్యూల్ ఉండి వారికి వివరించారు. కార్యక్రమంలో ఏడీ శ్యామూల్ పాల్, డైట్ ప్రిన్సిపాల్ వసుంధరా దేవి, అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

కర్నూలు(కల్చరల్), మార్చి 5: తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటూ జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అవగామన ర్యాలీ నిర్వహించారు. కళాశాల లోని భువవ విజయం యువత సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన యువజన సదస్సులో కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ దేవికారాణి, వైవీ మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సి.బెళగల్, మార్చి 5: మండలంలోని పోలకల్లు, సి.బెళగల్ గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులను పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మంగళవారం పరి శీలిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. సన్నకారు రైతులు పండ్లతోటలను పెంచుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీవో శకుంతల, ఏపీవో లక్ష్మన్నలను ఆదేశించారు. పీడీ వెంట ఈసీ పృథ్వీరాజు, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు ఉన్నారు.

పేదల బియ్యం పెద్దలపాలు

● హొళగుంద కేంద్రంగా అక్రమ దందా
● వేల టన్నులు రీ సైక్లింగ్‌చేసి నల్లబజారుకు
● మిల్లర్లు, డీలర్లు, ఎండీయూ వాహనదారుల ముఠా ఆగడాలు
● అడిగేవారే లేరు.. ఆపేవారే కనిపించరు

పేదలకు అందాల్సిన బియ్యం పెద్దల పాలవుతోంది. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఇస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు పందికొక్కుల్లా బొక్కేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లర్లు రీసైక్లింగ్ చేసి వేల టన్నుల బియ్యాన్ని సరిహద్దులు దాటించి నల్లబజారులో యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. ఈ దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా హొళగుంద కేంద్రంగా సాగుతున్నా అడిగేవారే లేరు.. ఆపేవారే కనిపించరు. గతంలో దళారులు రేషన్‌బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి సేకరించి రైస్‌మిల్లులకు అమ్మేవారు. ప్రస్తుతం డీలర్లు, ఎండీయూ వాహనదారులు, దళారులు ముఠాగా ఏర్పడి రైస్‌మిల్లులకు యథేచ్ఛగా తరలిస్తున్నారు.


హొళగుంద నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనం, వ్యక్తులు

హొళగుంద, మార్చి 5: మండలంలో 17 పంచాయతీలకు గాను 32 రేషన్ షాపులు ఉన్నాయి. 16,635 రేషన్‌కార్డు లబ్ధిదారులు ఉన్నారు. మండలానికి నెలనెలా 2,597 క్వింటాళ్ల రేషన్ బియ్యం పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చౌకదుకాణాలకు పీడీఎస్ ద్వారా సరఫరా చేస్తోంది. కొందరు డీలర్లు, ఎండీయూ వాహనదారులు, దళారులు ముఠాగా ఏర్పడి పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రైసు మిల్లులకు తరలిస్తున్నారు. ఇలా వేల క్వింటాళ్ల బియ్యాన్ని రూ.18ల చొప్పున మిల్లర్లు కొనుగోలు చేసి వాటిని రీ సైక్లింగ్ చేసి (పాలిష్ చేసి) వేల క్వింటాళ్ల బియ్యాన్ని సరిహద్దులు దాటించి నల్లబజారులో యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు.

● **హొళగుంద అడ్డాగా రేషన్ దందా...**

ఆదోని, ఆలూరు, గూళ్యం, హాలహర్వి, సంతెకూడ్లూరు, పెద్దహరివాణం నుండి వేల క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని హొళగుందలో ని ఓ రైస్‌మిల్‌కు తరలించి రేషన్ బియ్యాన్ని అక్కడే రీ-సైక్లింగ్ చేసి సన్న బియ్యంగా పాలిష్ చేసి 50, 25 కిలోలు సంచులుగా ప్యాక్ చేసి లారీల్లో కర్నాటకకు తరలిస్తున్నారు. కేవలం రేషన్ బియ్యం రిసైక్లింగ్ చేయడం కోసమే రైస్‌మిల్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

● **అధికారుల అండదండలు**

రేషన్ మాఫియాకు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో రేషన్ దందా నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. రాత్రి 10 గంటలకే యథేచ్ఛగా రేషన్ బియ్యం వాహనాలు సంబంధిత రైస్ మిల్లుకు నేరుగా వెళ్లిపోతున్నాయి. నెల మామూలు ఉండటంతో ఆ వాహనాల జోలికి ఎవ్వరూ వెళ్లడం లేదన్నది బహిరంగ రహస్యం.

గతంలో ఆ రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు సుమారు 137 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినా ఇంకా అలాగే ఈ అక్రమ దందా కొనసాగుతూ ఉండడం గమనార్హం. పోలీసులు అప్పుడప్పుడు అడపాదడపా కేసులు పెట్టినా, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన వసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం

ఈ వ్యవహారంపై ఆర్‌ఐ ద్వారా విచారణ చేయిస్తాం. రేషన్ దందా నిర్వహించే వారిపై, అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేసే వారి పై పోలీసులతో కలిసి కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఏఎం ప్రసాద్ రాజు, తహసీల్దార్

ఎన్నికలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి : కలెక్టర్

● సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలన


వెంకటాపురం కాలనీలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ఎమ్మిగనూరు, మార్చి 5: ఎన్నికలు మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని, అలాంటి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని, వెంకటాపురం కాలనీలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని, రూట్ మ్యాప్‌ను కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటాపురం కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాజ్యాంగాన్ని, మన భవిష్యత్తును నిలబెట్టేవిధంగా ఎవరి నిర్ణయం మేరకు వారు ఓటు వేసుకునే విధంగా ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, జడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య తహసీల్దార్ శేషారెడ్డి, సీఐలు మధుసూదన్ రావు, మోహన్ రెడ్డి, డీటీ గురురాజ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు : పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌళిక వసతులు కల్పించాలని కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈవీఎంలను భద్రపరచే గదులను, పోలింగ్ కేంద్రాల మ్యాప్‌ను వారు పరిశీలించారు.

ఆదోని : ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ మెటీరియల్ డిస్పాచ్ సెంటర్‌ను కలెక్టర్ డాక్టర్ జీ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పరిశీలించారు.

నేత్రదానంతో అంధుల జీవితాలలో వెలుగులు

ఆదోని టౌన్, మార్చి 5: పట్టణంలోని సంతపేటలో నివాసముంటున్న విశ్వనాథ్ (62) మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసి అంధుల జీవితాలలో వెలుగులు నింపాలని భావించారు. సాయి జ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ ద్వారా నేత్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్రదాత భార్య పుష్పావతి, కుమారుడు శరణబసవ, కుమార్తె అరుణ, అల్లుడు మంజునాథ్‌లకు ఐ ఫౌండేషన్ వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐ ఫౌండేషన్ సభ్యులు కొల్లి శ్రీధర్, సహారా శంకర్, గురు బసవరాజ, పెండెకల్ శివ, టెక్నీషియన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ షాపుల కూల్చివేత

ఆదోని టౌన్, మార్చి 5: పట్టణంలోని ప్రధాన రహదారిలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలోని పాత మున్సిపల్ షాపులను మంగళవారం అధికారులు కూల్చివేశారు. ఈ ప్రాంతంలో రూ.33 కోట్ల ఖర్చుతో మూడు అంతస్తుల కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఇటీవల అనుమతి లభించింది. షాపుల వేలంపాట ద్వారా నిధుల సమీకరణతో ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి అన్ని ఫార్మాలిటీస్ పూర్తి కావడంతో భూమి పూజ చేశారు. షాపుల తొలగింపు పై లీజుదారులు కోర్టులో స్టే పొందడంతో నిర్మాణ పనులు వాయిదా పడుతూ వచ్చాయి. చివరికి అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో మంగళవారం పాతషాపుల తొలగింపు పనులను ప్రారంభించారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దు

ఆదోని టౌన్, మార్చి 5: పట్టణంలో తాగునీటి సరఫరా విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి నీటి విభాగం సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం ఆయన మున్సిపల్ పార్కు సమీపంలోని వాటర్ పంప్ హౌస్‌ను సందర్శించి సిబ్బంది పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలం రానుందని, నీటీని పొదుపుగా వాడుకోవడంతో పాటు నీటి వృథాను అరికట్టడంలో తగిన శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.

ఘనంగా అల్లీసాహెబ్ స్వామి ఉరుసు

గోనెగండ్ల, మార్చి 5: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో వెలసిన అల్లీసాహెబ్ స్వామి ఉరుసు మంగళవారం వైభవంగా జరిగింది. హెచ్ కైరవాడి గ్రామస్థులే కాక కర్నూలు, బళ్లారి, మహబూబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఉరుసుకు హాజరయ్యారు. స్వామివారి జీవసమాధిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామి వారి గుర్రాన్ని గ్రామ వీధుల గుండా మేళతాళలతో దర్గా వరకు ఊరేగించారు. బుధవారం జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సచివాలయంలో పార్టీ కార్యక్రమాలు

● తాళాలువేసి ఎంపీడీవోకు సర్పంచు ఫిర్యాదు


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న సాంబశివారెడ్డి, వెంకట నాయుడు

పత్తికొండ, మార్చి 5 : ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించాల్సిన సచివాలయాన్ని అధికార పార్టీనాయకులు ఏకంగా ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ అడ్డాగా వాడుకున్నారు. సర్పంచు సచివాలయానికి తాళాలువేసి ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. అవమానంగా భావించిన వైసీపీ నాయకులు సర్పంచ్ వర్గానికి చెందిన వెంకట్‌నాయుడు పత్తికొండ శివారులో ఒంటరిగాఉండడంతో దాడిచేసి గాయపర్చారు. గ్రామపెద్ద టీడీపీ సీనియర్ నాయకుడు సాంబశివారెడ్డి బాధితునితోపాటు టీడీపీ నాయకులతో కలసి డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని కలసి మాట్లాడారు. అధికారపార్టీ నాయకులు దాడులకు పాల్పడుతూ కక్షలకు ఆజ్యం పోస్తున్నారని పేర్కొన్నారు. దాడిచేసిన వారిపై చట్టపరచర్యలు చేపట్టాలని కోరారు. టీడీపీ నాయకులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, శ్రీధర్‌రెడ్డి, కడవలసుదాకర్, బీటీగోవింద్, శ్రీకాంత్‌చౌదరిలతోపాటు టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

'కాపు నేతలు సలహాలు మానుకోవాలి'

మద్దికెర, మార్చి 5: కాపు సంఘం నాయకుడు హరిరామజోగయ్య కాపు కులస్థులకు చేసిందేమీ లేదని, ఆయన సలహాలు మానుకుంటే కాపులంతా బాగు పడుతామని సౌత్ ఇండియా కాపు కార్పొరేషన్ రాయలసీమ పరిశీలకులు వైపీ వీరన్న అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హరిరామజోగయ్య లాంటి నాయకులు కాపు కులంలో ఉన్నంత వరకు కాపు కులం బాగుపడదన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సలహాలు ఇచ్చి జనసేన పార్టీకి ద్రోహం చేయాలని చూశారని గుర్తుచేశారు. ఎవరెన్ని ఎన్ని జిమ్మికులు చేసినా త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పక్షాన నిలబడుతామని స్పష్టం చేశారు.

అమీనమ్మ ట్రస్టుకు 4 ఎకరాల భూమి విరాళం

తుగ్గలి, మార్చి 5: అమీనమ్మ చారిటబుల్ ట్రస్టుకు తుగ్గలికి చెందిన చల్లా వెంకట నాగవేణి నాలుగు ఎకరాల 21 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు చల్లా వెంకటశర్మ, భార్య చల్లా వెంకట జ్ఞానేశ్వరి జ్ఞాపకార్థం వారి చివరి కోరిక మేరకు వారి ఏకైక కుమార్తె చల్లా వెంకట నాగవేణి భర్త విద్యాసాగర్ వారి తండ్రి నుంచి వచ్చిన ఆస్తి సర్వేనెంబర్.816/4లో నాలుగు ఎకరాల 21 సెంట్లు సర్వేనెం.758లో 20 సెంట్లును ఛైర్మన్ అమీనమ్మ చారిటబుల్ ట్రస్టుకు రిజిస్టర్ చేయించారు. ఈ ట్రస్టు నుంచి వృద్ధాశ్రమం, జగజ్జనని, అమ్మవారి దేవాలయానికి, వేద పాఠశాల నిర్వహణకు ఈ భూమిని విరాళంగా ఇచ్చామని అన్నారు. వృద్ధులు, మహిళలకు తాము అండగా ఉంటామని తెలిపారు.

బీసీ జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 5: వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీసీ జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీ పార్లమెంట్ సీట్లను కేటాయించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు బీసీలు ఎన్నికల ముందు మాత్రమే గుర్తుకొస్తామని అన్నారు. బీసీ సామాజిక ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. తమ డిమాండ్లను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. చట్టసభలో 50 శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టే విధంగా తీర్మానం చేసి, రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు 50 శాతం వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. సమావేశంలో డివిజన్ ఉపాధ్యక్షుడు మాన్వి దేవేంద్రప్ప, కార్యదర్శి షేక్షావలి, ధనాపురం శేషన్న, వడ్డే శ్రీనివాసులు, బండారి రాజేశ్వరరావు, వీరభద్ర, వెంకటేష్, మల్లేశ్వరప్ప, సోమశేఖర్, మోహన్, కత్తి ప్రసాద్ పాల్గొన్నారు.

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

● సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన కూలీలు

ఆదోని రూరల్ మార్చి 5 : వలసలను నివారించడంలో.. కరువు సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం నాయకులు వెంకటేశులు, లింగన్న అన్నారు. మంగళవారం ఉపాధి కూలీలతో, కార్మికులతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధి కూలీలకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని, పనిదినాలు 200రోజులు కల్పించాలని, కరువు సహాయక చర్యలు చేపట్టి ఉచితంగా నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని తీసుకోవడానికి కార్యాలయ అధికారులు రాకపోవడంతో ఆగ్రహించిన వారు సబ్ కలెక్టర్ కార్యాలయ తలుపులకు వినతిపత్రాన్ని అతికించి నిరసన తెలిపారు.

రెండు నెలలుగా బియ్యం అందడం లేదు

● విచారణకు వెళ్లిన తహసీల్దార్‌తో గంజెహళ్లి గ్రామస్తుల ఆవేదన
● డీలర్లు, ఎండీయూ వాహన దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గజ్జెహళ్లిలో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కార్డుదారులు

హొళగుంద, మార్చి 5: రెండు నెలలుగా రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని గజెహళ్లి గ్రామస్తులు తహసీల్దార్‌తో మొరపెట్టుకున్నారు. ఈ నెల 5వ తేదీ ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన తహసీల్దార్ ఏయం ప్రసాద్ రాజు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న కార్డుదారులు అధికారిని చుట్టుముట్టారు, డీలర్‌లు రెండు నెలలుగా బియ్యం, బ్యాళ్లు, చెక్కెర ఇవ్వకుండా తమ పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్డుదారులు వెనుతిరిగారు. ఎమ్మార్వోతో పాటు డిప్యూటీ తహసీల్దార్ ముకుందా రావు, అర్‌ఐ దినోజ్ కుమార్, వీఆర్వో ప్రహల్లాద్ ఉన్నారు.

టీడీపీ పాలనలోనే ప్రజలు చల్లగా ఉంటారు : బీవీ


ఎమ్మిగనూరు ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, మార్చి 5: టీడీపీ పాలనన లోనే ప్రజలు పది కాలాల పాటు చల్లగా ఉంటారని వచ్చే ఎన్నికలలో టీడీపీ ని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఆంధ్రుడిపై ఉందని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం పొద్దు పోయాక ఆయన హెచ్ కైరవాడి లోని అల్లీస్వామి ని దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు, రైతులు చల్లగా ఉండాలని ఈ ఏడాది వర్షాలు సకాలంతో కురవాలని దైవంను ప్రార్థించినట్లు బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. అనంతరం ఆయన టీడీపీ నాయకుని ఇంట్లో మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన అస్థవ్యస్థంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలు అమలు జరగాలంటే టీడీపీ కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మారె డ్డి, ఎర్రన్న, గూడం అల్లిపీర, రాజేష్‌నాయుడు, నరసప్పగౌడ్, పెద్దయ్య, కురువ శ్రీరాముడు, వడ్డే రఘు, వడ్డే మల్లి, కన్వీనర్ నజీర్‌సాహెబ్, అబుబకర్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నూరహమ్మద్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మిగనూరు ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బీవీ జయనాగేశ్వరరెడ్డి నిర్వహించారు.

వలస వెళ్లిన మహిళ మృతి

మంత్రాలయం, మార్చి 5: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన మజ్జిగ నరసమ్మ (34) కూలి కోసం వలస వెళ్లి గుంటూరులో మృతి చెందింది. బంధువుల వివరాల మేరకు.. నెల క్రితం రచ్చుమర్రి గ్రామం నుంచి వంద కుటుంబాలు గుంటూరు వలసవెళ్లాయి. మజ్జిగ నరసమ్మ సైతం గుంటూరు వలస వెళ్లి మిరప పంట కోస్తూ జీవనం సాగించేది. ఎండవేడిమికి తట్టుకోలేక సోమవారం మృతి చెందింది. ఉన్న ఊరిలో పనులు లేక పొట్టకూటి కోసం వలస వెళ్లి అస్వస్థతకు గురై మృతి చెందడంతో ఆమె మృతదేహాన్ని మంగళవారం గ్రామానికి తెచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

డిగ్రీ ఫెయిల్ అయిన వారికి పరీక్షలు రాసే అవకాశం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 5: 2014 ఏడాదికి ముందు డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు తిరిగి పరీక్షలు రాసేందుకు రాయలసీమ విశ్వవిద్యాలయం అవకాశం కల్పించిందని ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏలో సబ్జెక్టులు ఫెయిల్ అయిన వారు ప్రత్యేక సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాటు చేసిందన్నారు. పరీక్షలు మే లేదా జూన్ మాసంలో జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజు ఈ నెల 6 నుంచి చెల్లించవచ్చన్నారు. వివరాలకు కళాశాల కార్యాలయంలో లేదా ఆర్‌ఎస్‌యూఅడ్మిషన్.కమ్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

కారు ఢీకొని వీఆర్‌ఏకు తీవ్ర గాయాలు

మంత్రాలయం, మార్చి 5: మంత్రాలయం సమీపంలో అయ్యప్పస్వామి గుడి వద్ద కారు వీఆర్‌ఏ నరసప్పను మంగళవారం ఢీకొట్టింది. ఎస్‌ఐ గోపీనాథ్ వివరాల మేరకు.. గ్రామ వీఆర్‌ఏ నరసప్ప మోటారుసైకిల్ పై మంత్రాలయం నుంచి కల్లుదేవకుంట వైపు వెళ్తుండగా.. దేవనకొండకు చెందిన కారు రాయచూరు వెళ్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీఆర్‌ఏ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. వీఆర్‌ఏ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ గోపినాథ్ తెలిపారు. గాయపడిన వీఆర్‌ఏ నరసప్పను తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఆర్‌ఐ ఆదామ్, డీటీలు రాఘవేంద్ర, శశిశేఖర్‌రావు, ఆనందు, భీమన్నగౌడు, పవన్ పరామర్శించారు.

టీడీపీతో బీసీల అభ్యున్నతి : కేఈ


పందికోనలో ప్రజలకు సూపర్ సిక్స్ గురించి వివరిస్తున్న కేఈ

పత్తికొండ, మార్చి 5 : టీడీపీతోనే రాష్ట్రంలో బడుగు,బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమని పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. బాబుషూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం పందికోన గ్రామంలో పర్యటించారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోద్వారా టీడీపీ అధికారంలోకి రాగానే ప్రజలకు అందించే పథకాల గురించి వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కొత్తగా పథకాలు అందించకపోగా సబ్సిడీ రుణాలను సైతం రద్దుచేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో టీడీపీకి ఓటువేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఆయనతోపాటు సర్పంచు మంజుల, నాయకులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రామానాయుడు, శ్రీధర్‌రెడ్డి, కడవలసుధాకర్, చెన్నంనాయుడులతోపాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల నుంచి రక్షణ కల్పించాలని ధర్నా

ఆదోని టౌన్, మార్చి 5: పట్టణంలో కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాల్ కమిషనర్ రామచంద్రారెడ్డికు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, ముక్కన్న, నాగరజు, కృష్ణమూర్తి, వెంకటేష్ శ్రీనివాసులు, ఎక్బల్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాటాను ఏర్పాటు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్): మార్కెట్ యార్డులో ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్ (కాటా)ను ఏర్పాటు చేసి, పత్తి రైతులకు జరిగే మోసాల నుంచి అరికట్టాలని ఏపీ రైతు సంఘం ఆదోని గౌరవాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు నరసప్ప, కార్యదర్శి ఎల్లప్ప కోరారు. మంగళవారం మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కౌతాళం : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ విజయ భారతి కుమారి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను మండల విద్యాధికారి-2 శోభారాణితో కలసి అకస్మికంగా తనిఖీ చేశారు.

కోసిగి : ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు కింద చేసిన పనులను సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ విజయజ్యోతి కుమారి జడ్పీహెచ్ పాఠశాలతో పాటు కోసిగిలోని ఎంపీపీఎస్, రంగప్పగట్టు, కేజీబీవీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

గురుజాలలో హుండీ ఆదాయం లెక్కింపు

నందవరం : గురుజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కింపు, టెంకాయల వేలం పాట జరిగింది. హుండీ లెక్కింపు రూ 2,16,0,16, టెంకాయల వేలం రూ 1, 25,600 వచ్చింది. ఈవో దినేష్ ఆలయ చైర్మన్ పెద్దనరసింహులు, ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ టీడీపీ నాయకులు శివారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగుల గర్జనను జయప్రదం చేయండి

కౌతాళం: ఈ నెల 9న అమరావతిలో నిర్వహించనున్న వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజబాబు కోరారు. మంగళవారం గర్జనకు సంబంధించిన పోస్టర్లను దివ్యాంగులతో కలసి విడుదల చేశారు. ఈరన్న, ఖాసీం, కృష్ణనంద, నాగరాజు, రామన్న, తాయన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పత్తికొండ : అమరావతిలో జరిగే మహాగర్జనకు పెద్దఎత్తున తరలిరావాలని డీహెచ్‌పీఎస్ నాయకులు రంగస్వామి, భీరప్ప, సోమన్న పిలుపునిచ్చారు. పత్తికొండలో ఛలో అమరావతి వాల్‌పోస్టర్లను డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో విడుదల చేశారు.

బ్రహ్మగుండం ఆలయ కమిటీ ఎన్నిక

వెల్దుర్తి, మార్చి 5 : పట్టణ సమీపంలోని బ్రహ్మగుండ క్షేత్రం ఆలయ ధర్మకర్తల మండలిని దేవస్థానం ఈఓ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బొమ్మన పెద్దిరెడ్డి, సత్యనారాయణ, శివమ్మ, వెంకటరమణమ్మ, సుజాత, పుల్లమ్మ, మధు సభ్యులను ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా బొమ్మన పెద్దిరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా మండల కన్వీనర్ రవిరెడ్డి, జడ్పీటీసీ సుంకన్న, సర్పంచి శైలజలు పాల్గొన్నారు. అనంతరం శివరాత్రి ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన బీసీ సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్ : బీసీ శ్మశాన వాటిక స్థలంలో గోశాలను ఏర్పాటు చేయరాదని ఎమ్మిగనూరు బీసీ సంఘాల నాయకులు బతకన్న,యాపిలయ్య, బీఎల్ నారాయణ, లక్ష్మన్న, మాదవస్వామి, కామలే గణేష్, నారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కోరారు. బుధవారం జరిగే మున్సిపల్ కౌన్సిల్‌లో సమావేశంలో ఈమేరకు తీర్మానం చేయనున్నట్లు తమకు తెలిసిందని ఆయన దృష్టికి తెచ్చారు.

భయం వీడితే పరీక్షల్లో మంచి ఫలితాలు

మద్దికెర, మార్చి 5: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకునే విద్యార్థులు పరీక్షల భయం వీడితే.. మంచి ఫలితాలు సాధించగలరని కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు రామ్మోహన్, మండల విద్యాధికారి రంగస్వామి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుకునే విద్యార్థినులకు కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు, విశ్వనాథ్ సహకారంతో జామెట్రీ బాక్స్, ప్యాడ్స్‌లు విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గోపాల్, ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు ఉన్నారు.

'జగన్ మాటలు నమ్మి మోసపోవద్దు'

మద్దికెర, మార్చి 5: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్ రెడ్డి మాటలు నమ్మి మోసపోవద్దని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని ఓటు వేసి గెలిపించాలని మాజీ కోఆప్షన్ సభ్యులు ఇమామ్‌సాబ్, మాజీ ఎంపీటీసీ సుధాకర్ చౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగన్‌కు ఒక్కసారి చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రం 30ఏళ్ల అభివృద్ధి వెనక్కు వెళ్లిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ హుశేన్‌పీరా, యూనిట్ ఇన్‌చార్జి నర్ర సుధాకర్, నాయకులు నీలకంఠ, రాజశేఖర్, రఘు, జనార్దన్ ఉన్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, మార్చి 5: మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన మంచాలమ్మ దేవతకు విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం మాఘ బహుళ నవమిని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చారు.